కోడ్ సాకుతో గ్యారెంటీలకు ఎగనామం!

- మాజీ ఎంపీ వినోద్ కుమార్

కథలాపూర్, ఫిబ్రవరి 24: పార్లమెంట్ ఎన్నికల కోడ్ సాకుతో కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీలకు ఎగనామం పెట్టాలని చూస్తున్నదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తాండ్రియాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, లోకబాపురెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. అడ్డగోలు హామీలిచ్చి కాంగ్రెస్ అధికారాన్ని దక్కించుకున్నదని దుయ్యబట్టారు. అప్పు డు ఎడాపెడా హామీలిచ్చి ఇప్పుడు గ్యారెంటీలను అమలు చేసేందుకు కిందామీద పడుతున్నదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీల అమలు కోసం పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాకముందే జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బరాజ్‌కు పగుళ్లు వచ్చాయనే కారణంతో ఈ యాసంగిలో గోదావరి నీళ్లను ఇతర ప్రాజెక్టులోకి ఎత్తిపోయకపోవడంతో రైతులు సాగు విస్తీర్ణాన్ని తగ్గించారని, అయినా వేసిన పంటలు కూడా నీళ్లు లేక ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతుబంధు సాయంపై పరిమితి!: మంత్రి దుద్దిళ్ల

బోధన్, ఫిబ్రవరి 24: రైతుబంధు సాయంపై పరిమితి విధించే ఆలోచన ఉన్నదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎన్ని ఎకరాలున్నా ఓ పరిమితి విధించే అవకాశం ఉన్నదని, పంట పండించకపోతే అసలు రైతుబంధు ఇచ్చే ఉద్దేశం లేదని ఆయన పేర్కొన్నారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు కమిటీ సభ్యులైన ఎమ్మెల్యే పీ సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, షుగర్ కేన్ డైరెక్టర్ మల్సూర్ శనివారం నిజామాబాద్ జిల్లా బోధన్ శివారులోని శక్కర్‌నగర్‌లో గల నిజాం షుగర్స్‌ను సందర్శించారు. చెరుకు రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలను తీసుకున్నారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణకు కృషి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని మార్చి 2న అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసింది.

బీసీ ఉద్యమానికి అండగా ఉంటాం

ఆలిండియా ఓబీసీ జేఏసీకి మాజీ మంత్రి హరీశ్‌రావు భరోసా

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): తరతరాలుగా ఉత్పత్తి, శ్రమలో పాల్గొంటూ సమాజానికి ఎంతో సేవ చేస్తున్న బీసీలు న్యాయం కోసం చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని మాజీ మంత్రి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. చట్టసభల్లో బీసీల వాటా సాధన కోసం మార్చి 1 నుంచి మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మిరిగోన్‌పల్లి వీరయోధుడు పండుగ సాయన్న జన్మస్థలం నుంచి నిర్వహించతలపెట్టిన బీసీ మహా పాదయాత్రకు హాజరుకావాలని కోరుతూ మాజీ మంత్రి హరీశ్‌రావును ఆలిండియా ఓబీసీ జేఏసీ బృందం ఆహ్వానించింది. ఈ సందర్భంగా జేఏసీ బృందంతో హరీశ్‌రావు మాట్లాడారు. కుల జనగణన, మహిళా బిల్లులో బీసీ కోటా, రిజర్వేషన్లపై 50 శాతం వాటా ఎత్తివేతతోపాటు చట్టసభల్లో బీసీ వాటా కోసం ఆలిండియా ఓబీసీ జేఏసీ చేస్తున్న పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బీసీ సబ్బండ వర్గాల పాత్ర కీలకమైనదని, అదే స్ఫూర్తితో బీసీ వాటా సాధన ఉద్యమం కూడా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. హరీశ్‌రావును కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు ఏటిగడ్డ అరుణ, ఆలిండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, వైస్ చైర్మన్ వెలుగు వనిత, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహా పాదయాత్రకు మాజీ మంత్రి హరీశ్‌రావును ఆహ్వానిస్తున్న ఓబీసీ జేఏసీ నేతలు

నేడు పాలమూరు జిల్లాలో
కేటీఆర్ పర్యటన

- రెండు అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. అచ్చంపేట, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు అచ్చంపేట నియోజకవర్గంలోని డీకే ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో, మధ్యాహ్నం 2 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొననున్నారు.

లోకం పోకడ



వంద రోజులకు ఇంకా ఎన్ని గంటలున్నాయో లెక్కపెట్టుకుంటాం!

అడిషనల్ డీజీపీగా స్టీఫెన్ రవీంద్ర

- సీనియర్ ఐపీఎస్‌లకు పదోన్నతులు

హైదరాబాద్, ఫిబ్రవరి24 (నమస్తే తెలంగాణ): సీనియర్ ఐపీఎస్‌లకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 1999 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన స్టీఫెన్ రవీంద్రకు అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ప్రమోషన్ కల్పించింది. 2006 బ్యాచ్‌కు చెందిన కార్తికేయ, రమేశ్‌నాయుడు, ఏవీ రంగనాథ్, సత్యనారాయణ, సుమతి, ఎం శ్రీనివాసులును ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి కల్పించింది. 2010 బ్యాచ్‌కు చెందిన న్యాలకొండ ప్రకాశ్‌రెడ్డి, జోయల్ డేవిస్‌ను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మరి కొందరు నాన్‌క్యాడర్ ఎస్పీలకూ ప్రమోషన్లు కల్పించినట్టు సమాచారం.

షరతులతో ప్రజలను వంచించకండి

మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలన్నీ అమలుచేయండి

- 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, సిలిండర్ అందరికీ ఇవ్వండి
- నిబంధనల పేరుతో పథకాలకు భారీగా అర్హులను తగ్గిస్తున్నారు
- కరెంటుపోతే చిరుద్యోగులపై చర్యలు తీసుకుంటారా?
- మరి ఆ శాఖ మంత్రిగా భట్టిని సస్పెండ్ చేయరా?
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దాసోజు శ్రవణ్, చిత్రంలో పల్లె రవి, శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమల్లో ప్రజలను వంచించే విధంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా హామీలను అమలు చేయాలని, కానీ నిబంధనలు, షరతుల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ యత్నిస్తున్నదని ఆరోపించారు. తెలంగాణభవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రవణ్ మాట్లాడుతూ.. ఈ నెల 27న ప్రియాంకగాంధీ చేతుల మీదుగా ప్రారంభించనున్న రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు రెండు గ్యారెంటీల్లోనూ అర్హులైన లబ్ధిదారులను తగ్గించేలా ప్రభుత్వం నిబంధనలను రూపొందించిందని అన్నారు. రాష్ట్రంలో 1.24 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, వాటిలో 90 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయని, అయితే ప్రస్తుతం 40 లక్షల మందికే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామంటున్నారని, మిగిలిన వారి సంగతేంటని ఆయన ప్రశ్నించారు. దానిలో కూడా ఏడాదికి 3 సిలిండర్లు మాత్రమే ఇస్తామని చెప్తున్నారని, ఇది ప్రజలను మోసం చేయడం కాదా? అని నిలదీశారు. వినియోగదారుడు మొత్తం డబ్బులు చెల్లించి సిలిండర్ తీసుకోవాలని, తర్వాత వారి అకౌంట్లో డబ్బులు జమ చేస్తామనే నిబంధన కూడా సరికాదని పేర్కొన్నారు. బ్యాంకులతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఉచిత విద్యుత్తులోనూ కొత్త నిబంధనలు

రాష్ట్రంలో 1.31 కోట్ల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, వీటిలో 200 యూనిట్లలోపు విద్యుత్తును వాడుకునేవారు 1.05 కోట్ల మంది ఉన్నారని, కానీ ఇప్పుడు కొత్త కొత్త నిబంధనలు పెడుతున్నారని శ్రవణ్ విమర్శించారు. ప్రతి ఇంటికి ఉచిత విద్యుత్తు సౌకర్యం అన్నారని, ఎన్నికల తర్వాత నిబంధనల పేరుతో అర్హులను తగ్గించే కుట్ర జరుగుతున్నదని పేర్కొన్నారు. వీటన్నింటిపైనా ప్రజలు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీయాలని కోరారు.

సమ్మక్క సాక్షిగా రేవంత్ అబద్ధాలు

సమ్మక్క, సారలమ్మ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడారని శ్రవణ్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 60 రోజుల్లోనే 25 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారని, ఇది ప్రజలను మోసగించడం, తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. వీటికి ఎప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చారో, ఎప్పుడు పరీక్షలు పెట్టారో రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడారం అమ్మవారి సాక్షిగా అబద్ధాలు ఆడినందుకు సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కరెంటు కోతలకు కొందరు అధికారులే కుట్ర పన్నారని సీఎం అంటున్నారని, కరెంట్ కట్‌చేస్తే కొలువులు తీసేస్తా అని కూడా చెప్తున్నారని, ఆయన సీఎం కాగానే కరెంటు ఇబ్బందులు ఎందుకు మొదలయ్యాయని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కనురెప్ప కొట్టినంతసేపుకూడా కరెంటు పోలేదని అన్నారు. రేవంత్ తన చేతకానితనాన్ని, అసమర్థతను చిన్న ఉద్యోగులపై నెడుతున్నారని మండిపడ్డారు. కరెంటు కోతలకు బాధ్యుడిగా ఆ శాఖ మంత్రి భట్టిని రేవంత్ సస్పెండ్ చేస్తారా? అని నిలదీశారు. హామీలన్నీ అమలు చేసేదాకా నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	13.1°c	37.1°c
మెదక్	16.6°c	34.6°c
రంగారెడ్డి	17.2°c	36.8°c
నిజామాబాద్	18.7°c	33.3°c
మహబూబ్‌నగర్	22.1°c	35.4°c
కరీంనగర్	23.0°c	33.0°c
వరంగల్	23.0°c	32.0°c
ఖమ్మం	23.0°c	37.0°c
నల్లగొండ	23.0°c	35.0°c
హైదరాబాద్	23.2°c	33.3°c

రేవంత్‌రెడ్డి నయా దేశ్‌ముఖ్

- ఇది ప్రజాపాలన కాదు.. ప్రతీకార పాలన
- సీనియర్ జర్నలిస్టు శంకర్‌పై దాడి కాంగ్రెస్ గూండాల పనే
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిశాకే దాడికి సాయిరాంరెడ్డి పక్కా ప్లాన్
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, క్రాంతికిరణ్

మీడియాతో మాట్లాడుతున్న బాల్క సుమన్, చిత్రంలో క్రాంతికిరణ్, ఆంజనేయగౌడ్, పల్లె రవి, రమేశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి నయా దేశ్‌ముఖ్‌లాగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సీనియర్ జర్నలిస్టుశంకర్‌పై కాంగ్రెస్ గూండాలు పథకం ప్రకారం దాడి చేశారని, ఇందుకు సీసీ ఫుటేజీ ఉన్నదని బాల్క సుమన్ చెప్పారు. శంకర్‌ను చంపాలనే పాశవిక దాడికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత శశిధర్‌రెడ్డి అనుచరుడు సాయిరాంరెడ్డి శంకర్ హత్యకు రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం హత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డిని సాయిరాంరెడ్డి కలిశాకే ఈ దాడి జరిగిందని తెలిపారు. ప్రస్తుతం జర్నలిస్టు శంకర్ తీవ్రగాయాలతో దవాఖానలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఇటీవలికాలంలో జర్నలిస్టులు చిలుక ప్రవీణ్, రంజిత్, ఆకుల ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డిపైనా దాడులు, వేధింపులు జరిగాయని తెలిపారు. కాంగ్రెస్ పాలన మూడు నెలలు కాకముందే అనేక అకృత్యాలు చోటుచేసుకుంటున్నాయని, మేడారంలో సీఎం రేవంత్ ముందే భక్తులపై పోలీసులు లాఠీచార్జీ చేశారని వివరించారు. ఇప్పటి దాకా బీఆర్ఎస్ కార్యకర్తలపై 2,600 అక్రమ కేసులను నమోదు చేశారని తెలిపారు. ప్రశ్నించే గొంతులపై దాడుల చేయడమే ప్రజాపాలనా? కేసులు, కూల్చివేతలు, ఆకలిచావులు, ఆత్మహత్యలు ఉండటమే ఇందిరమ్మ రాజ్యమా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తున్నదని క్రాంతికిరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజాపాలన కాదని, తెలంగాణ మీద ప్రతీకార పాలనగా ఉన్నదని ధ్వజమెత్తారు. అందోల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు చేస్తూ ఉల్టా కేసులు పెడుతున్నారని, ఇప్పటివరకు 24 అక్రమ కేసులు నమోదు చేశారని తెలిపారు. ప్రజా సమస్యలపైనే స్పందించే జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలు సరికాదని హితవు పలికారు. ప్రస్తుతం కాంగ్రెస్(ఐ) కాస్తా కాంగ్రెస్ (ఆర్)గా అంటే కాంగ్రెస్ రేవంత్, రౌడీలుగా మారిందని కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ అభివర్ణించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె రవి, రామ్మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

అవి విసుగు యాత్రలు

- బీఆర్ఎస్‌పై విమర్శలకే బీజేపీ యాత్రలు
- కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి చేసిందేమిటి?
- పార్లమెంటులో తెలంగాణ వాణి వినిపించేది బీఆర్ఎస్సే
- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న రావుల శ్రీధర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): బీజేపీ నాయకులు చేస్తున్నవి విజయ సంకల్ప యాత్రలు కావని, అవి విసుగు సంకల్ప యాత్రలని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో యాత్ర పేరిట తిరుగుతున్నారని, కేంద్రంలో అధికారంలో ఉండి రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ యాత్రలకు ప్రజాదరణ లేదని, బీఆర్ఎస్‌పై విమర్శలకే అవి పరిమితమయ్యాయని విమర్శించారు. పదేపదే బీఆర్ఎస్‌పై ఎందుకు విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆరేడు అసెంబ్లీ స్థానాలు గెలుచుకుందని గుర్తుచేశారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి తెలంగాణకు, ఆయన పార్లమెంటు నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఎందుకు ఓటువేయాలని ప్రశ్నించారు. ఐటీఐఆర్ రద్దయితే ఎందుకు అడగలేదని, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో వరదలు వస్తే నిధులు ఎందుకు ఇప్పించలేకపోయారని ప్రశ్నించారు. పొద్దున లేస్తే బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేయడం తప్ప మరో పని లేకుండా పోయిందని మండిపడ్డారు. మూసీ సుందరీకరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం ముందడుగు వేస్తే, నమామి గంగ తరహాలో నిధులు ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం వల్లే ఒక్క సీటు మినహా అన్నింటిలోనూ గెలిచామని పేర్కొన్నారు. పార్లమెంటులో తెలంగాణ వాణి వినిపించేది బీఆర్ఎస్ మాత్రమేనని శ్రీధర్‌రెడ్డి స్పష్టంచేశారు.

నిపుణ విద్య, ఉద్యోగ సమాచారం

ఏఐసీటీఈలో..

ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 7
- పోస్టులు: అసిస్టెంట్ ఇన్నోవేషన్, ఇన్నోవేషన్ ఆఫీసర్
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 10
- వెబ్‌సైట్:https://www.aicte-india.org

యూపీఎస్సీలో...

కేంద్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది.

- మొత్తం ఖాళీలు: 76
- పోస్టులు: అసిస్టెంట్ డైరెక్టర్ (కోస్ట్), గ్రేడ్-3 స్పెషలిస్ట్, ఏఈఈ, అసిస్టెంట్ కాస్ట్ అకౌంట్స్ ఆఫీసర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 14
- వెబ్‌సైట్: https://www.upsconline.nic.in

ఐఐఐటీలో...

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 15
- పోస్టులు: అసిస్టెంట్ రిజిస్ట్రార్, జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ టెక్నీషియన్ తదితరాలు
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 18
- వెబ్‌సైట్: www.iiitp.ac.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్ స్పెషల్ పాలిటీ, తెలంగాణ ఎకానమీ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

ప్రశ్నించే గొంతుకలపై దాడి
అప్రజాస్వామికం

- సెంటర్ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ అధ్యక్షుడు గోసుల శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): ప్రశ్నించే గొంతుకలపై దాడి అప్రజాస్వామికమని సెంటర్ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ అధ్యక్షుడు గోసుల శ్రీనివాస్ యాదవ్ దుయ్యబట్టారు. ప్రజాపాలన తెస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ప్రజలు, పాత్రికేయులపై భౌతిక దాడులకు దిగుతూ అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ తీరును ఎత్తిచూపిన జర్నలిస్టు శంకర్‌పై దాడిని ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. భావస్వేచ్ఛను అణచివేయాలని చూడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఎమర్జెన్సీ, నిర్బంధాలు వంటివి కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలోనే ఉన్నాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ గతానికి వర్తమానికి ఏమాత్రం తేడా లేదని ఆ పార్టీ అనుసరిస్తున్న వైఖరే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. జర్నలిస్టు శంకర్‌పై దాడికి కొన్ని రోజుల క్రితమే చిలుక ప్రవీణ్, రంజిత్, ఆకుల ప్రవీణ్, మరో జర్నలిస్టు శ్రీనివాస్‌రెడ్డి తదితరులకు బెదిరింపు ఫోన్స్ కాల్స్ వంటి దృష్టాంతాలను ఏకరువు పెడుతూ ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదే కదా? అని ఆయన ప్రశ్నించారు.

టూవీలర్ ఉంటే ఇల్లు రానట్టే!

మొదటిపేజీ తరువాయి...

తెలుసుకొనేందుకు రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అధ్యయనం నిర్వహిస్తున్నారు.

నిధులు తక్కువ.. లక్ష్యమెక్కువ

'ఇందిరమ్మ ఇండ్ల' పథకానికి 82,82,332 మంది దరఖాస్తు చేసుకొన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం 119 నియోజకవర్గాల్లో 4,16,500 ఇండ్లను నిర్మించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రకటించింది. ఈ పథకానికి బడ్జెట్‌లో 7,740 కోట్లు కేటాయించింది. అయితే, కేటాయించిన బడ్జెట్‌కు, ఇండ్ల లక్ష్యానికి పొంతన కుదరడం లేదు. ఒక్కో ఇంటికి రూ. ఐదు లక్షల చొప్పున 4.16 లక్షల ఇండ్లకు 20,825 కోట్లు ఖర్చవుతుంది. కేటాయించింది మాత్రం 7,740 కోట్లే. అంటే 13 వేల కోట్లకుపైగా వ్యత్యాసం ఉన్నది. దీంతో కేంద్ర నిధులపై ఆధారపడటమే కాకుండా లబ్ధిదారులను తగ్గించాల్సిన అనివార్యత ఏర్పడింది. అందుకే దరఖాస్తులను 360 డిగ్రీల కోణంలో పరిశీలిస్తున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో సగం మందికి.. కనీసం 40 లక్షల మందికి ఆర్థికసాయం చేయాలన్నా.. ప్రస్తుత కేటాయింపుల ప్రకారం పదేండ్లు పడుతుంది.

తిరస్కరించమే లక్ష్యంగా పరిశీలన?

దరఖాస్తులను తగ్గించడమే లక్ష్యంగా పరిశీలన జరుగుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే లెక్కకు మిక్కిలి కండీషన్లు పెట్టినట్టు పరిశీలకులు చెప్తున్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నదా? అది లేకుంటే ఆదాయ ధృవీకరణ, కుటుంబఆదాయం, ఆస్తులు, భూములు, పట్టణ ప్రాంతాలో ఇంటి జాగాలు ఉన్నాయా? కారు, ద్విచక్ర వాహనం, ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషిన్ ఉన్నాయా? ఇంట్లో ఎంతమంది పనిచేసే వారున్నారు? వారి నెల సంపాదన ఎంత? గతంలో ప్రభుత్వ లబ్ధిపొందారా? గతంలో ప్రభుత్వం ఇల్లు మంజూరు అయిందా? తదితర అంశాలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ పరిశీలన చూస్తుంటే రోజువారీ కూలీలు కూడా ఈ పథకానికి అర్హత పొందడం కష్టమేనని అంటున్నారు. కడు పేదలు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తే.. వారికి సర్కారు ఇచ్చే రూ.5 లక్షలతో ఇల్లు నిర్మించుకునేందుకు సొంత జాగా అయినా ఉండాలి కదా? అని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరు ఇల్లు మంజూరు చేయాలనే ఉద్దేశంకంటే దరఖాస్తును ఎలా తిరస్కరించాలనే తాపత్రయమే ఎక్కువగా ఉన్నట్టు కనపడుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కేంద్రం సహాయం చేసినా కటకటే

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా రాష్ట్రాల్లో పేదల గృహనిర్మాణానికి విరివిగా సహకారం అందిస్తున్నది. ఒక్కో యూనిట్‌కు గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు ఆర్థిక సహాయం చేస్తున్నది. కేంద్ర సహాయంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.3.5 లక్షలు జత చేయాల్సి ఉంటుంది. కేంద్రం నుంచి సహాయం పొందాలంటే వారు నిర్ధారించిన మార్గదర్శకాలకు లోబడి ఇండ్లను నిర్మించాల్సి ఉంటుంది. కనిష్ఠంగా 30 చదరపు మీటర్ల కార్పెట్ ఏరియాలో నిర్మించాలి. అంటే, కార్పెట్ ఏరియా కనిష్ఠంగా 323 చదరపు అడుగుల వరకు ఉండాలి. ఇందులో ఒక వంటగది, మరుగుదొడ్డి, ఒక హాలు, ఒక బెడ్రూమ్ ఉండేలా చూడాలి. అయితే రాష్ట్రాలు 323 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాలో స్థానిక అవసరాలకు తగ్గట్టు డిజైన్లలో మార్పులు చేసుకునే వెసులుబాటు ఉన్నది. అందుకే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో కూడా అధికారులు ఆయా ప్లాట్ ఏరియాలకు తగ్గట్టుగా కనీసం 323 చదరపు అడుగులకు తగ్గకుండా గృహాలు నిర్మించేలా పలురకాల డిజైన్లను రూపొందించారు. లబ్ధిదారులు తమ ఇష్టానుసారం డిజైన్లలో మార్పులు చేసుకునే వెసులుబాటు కూడా కల్పించాలని, కార్పెట్ ఏరియా మాత్రం కనీసం 323 చదరపు అడుగులు ఉండేలా చూడాలని నిర్ణయించారు. నిర్ధారిత లక్ష్యం ప్రకారం నాలుగు లక్షల 16 వేల ఇండ్ల నిర్మాణానికిగాను ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు ఏమాత్రం సరిపోయే అవకాశం లేదు.

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా చిన్నారెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి24 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ జీ చిన్నారెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ పదవికి క్యాబినెట్ మంత్రి హోదా లభిస్తుందని, ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. వనపర్తి జిల్లా గోపాల్‌పేట్ మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామంలో 1955లో జన్మించిన చిన్నారెడ్డి 1977లో యువజన కాంగ్రెస్‌లో చేరి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1980లో ఏపీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పదవిని చేపట్టారు. ఆ తరువాత పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ వనపర్తి నుంచి 1989, 1999, 2004, 2014లో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ మంత్రివర్గంలో 2007 నుంచి 2009 వరకు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. 2013 నుంచి ఏఐసీసీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ చివరి నిమిషంలో ఆయనకు టికెట్ నిరాకరించింది. దీంతో పార్టీ ఆయనకు ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ పదవిని కట్టబెట్టింది.